పసిడి రుణాలకు కళ్లెం!

నిబంధనలను కఠినతరం చేసే యోచనలో రిజర్వుబ్యాంక్



న్యూఢిల్లీ, మార్చి 7: పసిడి రుణాలకు కళ్లెం వేయడానికి రిజర్వు బ్యాంక్ సిద్ధమవుతున్నది. ఇబ్బడిముబ్బడిగా తీసుకుంటున్న గోల్డ్ లోన్లకు చెక్ పెట్టడానికి త్వరలో కఠిన నిబంధనలను అమలులేకి తేవాలని చూస్తున్నది. ఇందుకు సంబంధించి బ్యాంకులు, నాన్-బ్యాంకింగ్ ఆర్థిక సేవల సంస్థలు జారీ చేస్తున్న గోల్డ్ లోన్లపై నిఘా పెట్టాలని సూచించింది. గోల్డ్ లోన్ తీసుకున్నవారు ఈ నిధులను దేనికి వినియోగిస్తున్నారు.. అసలు బంగారం వారిదేనన్న దానిపై పూర్తి వివరాలు సేకరించాలని బ్యాంకులకు సూచించింది. గడిచిన ఆరు నెలల్లో దేశవ్యాప్తంగా బంగారం తాకట్టుపై రుణాలు 50 శాతానికి పైగా పెరగడంపై ఆందోళన వ్యక్తం చేసిన సెంట్రల్ బ్యాంక్.. దీనిపై ప్రత్యేక దృష్టి సారించింది. ధరలు రికార్డు స్థాయికి చేరుకోవడం వల్లనే రుణాలు అత్యధికంగా తీసుకుంటున్నారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తీసుకున్న రుణాలు వారు దేనికి వినియోగిస్తున్నారన్న విషయంపై మానిటర్ చేయాలని సూచించింది. రుణాలు తీసుకున్నవారి కుటుంబ వివరాలు, పసిడి వారిదేనా లేకపోతే ఇతరవారు వీరిపై తీసుకుంటున్నారా అనేదానిపై సమాచారం సేకరించాలని పేర్కొంది. ఇటీవల కాలంలో తమవద్ద ఉన్న బంగారాన్ని వేరేవారి పేరుమీద తీసుకొని ఇతర పెట్టుబడులు పెడుతున్నారనే సమాచారం ఆధారంగా ఆర్బీఐ ఈ నిర్ణయం తీసుకున్నది. ఒకవేళ తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించనియెడల ఈ బంగారాన్ని వేలం వేసే అవకాశం ఉంటుంది.

ఆరు నెలల్లో 50 శాతం వృద్ధి

పసిడి తాకట్టుపై రుణాలు తీసుకునేవారి సంఖ్య గణనీయంగా పెరగడంతో సెంట్రల్ బ్యాంక్ ఆందోళన వ్యక్తంచేసింది. గతేడాది సెప్టెంబర్ నుంచి ఇప్పటి వరకు పసిడి రుణాలు 50 శాతం పెరిగాయి. పసిడి వినియంలో రెండో అతిపెద్ద దేశమైన భారత్‌లో గోల్డ్ లోన్లకు అత్యధిక మంది ఆకర్షితులవుతున్నారు. గతేడాది సెప్టెంబర్‌లో ఎన్‌బీఎఫ్‌సీల గోల్డ్ లోన్లపై పరిమితులు విధించిన విషయం తెలిసిందే. గడిచిన 12 నుంచి 16 నెలల మధ్యకాలంలో నాన్-బ్యాంకింగ్ సంస్థలు జారీ చేసిన గోల్డ్ లోన్లపై ఆర్బీఐ ఆడిటింగ్ నిర్వహించగా, దీంట్లో ఎన్నో అనుమానాలు తలెత్తాయని, తీసుకున్నవారిలో సగానికి పైగా మంది వేరే అవసరాలకు వినియోగించారనే అనుమానం వ్యక్తంచేసింది.

ఐఐటీ హైదరాబాద్‌తో కోలిండియా జట్టు

హైదరాబాద్, మార్చి 7 (నమస్తే తెలంగాణ) : పర్యావరణహిత, ఉద్గార రహిత బొగ్గు, ఇంధనాలపై పరిశోధనలకోసం ఐఐటీ హైదరాబాద్‌తో కోల్ ఇండియా కీలక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. రూ.98 కోట్ల గ్రాంట్‌తో సెంటర్ ఆఫ్ క్లీన్ కోల్ ఎనర్జీ అండ్ నెట్ జీరో(క్లీన్జ్) సంస్థను ఐఐటీహెచ్‌లో నెలకొల్పేందుకు ఇరు సంస్థలు జట్టుకట్టాయి. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కేంద్ర బొగ్గుశాఖ మంత్రి జీ కిషన్‌రెడ్డి సమక్షంలో కోలిండియా సీఎండీ పీఎం ప్రసాద్, ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర బీఎస్ మూర్తిలు పరస్పర ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశ వృద్ధికి బొగ్గురంగం అతి ముఖ్యమైనదని, ఆర్థిక వ్యవస్థకు కీలకమైన ఇంధన వనరుగా కొనసాగుతున్న గణనీయమైన ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నదన్నారు.

ఉత్పాదక వ్యయం తగ్గాలి: సింగరేణి సీఎండీ బలరాం

బొగ్గు ఉత్పత్తి వ్యయం తగ్గినప్పుడే సంక్షేమం సాధ్యమని, ఉద్యోగుల పని సంస్కృతి మరింత మెరుగుపడాల్సిన అవసరముందని సింగరేణి సీఎండీ ఎన్ బలరాం పేర్కొన్నారు. శుక్రవారం సింగరేణిభవన్‌లో 38వ స్ట్రక్చర్ మీటింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సింగరేణి బొగ్గు విక్రయ ధరలు కోల్ ఇండియా, విదేశీ బొగ్గు కన్నా అధికంగా ఉన్నాయని, దీంతో ఈ బొగ్గుకు డిమాండ్ క్రమంగా పడిపోతున్నదని, ఇది ఆందోళనకరమని ఆయన వ్యాఖ్యానించారు. బొగ్గు ఉత్పాదక వ్యయం రూ.12 వేల నుంచి రూ.16 వేల వరకు ఉంటుందన్నారు.

పెన్షన్ మొత్తాన్ని పెంచండి

సింగరేణి రిటైర్డ్ కార్మికుల పెన్షన్ మొత్తాన్ని పెంచాలని రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డీ రామచందర్‌రావు కోరారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కోల్ ఇండియా చైర్మన్ పీఎం ప్రసాద్, సింగరేణి సీఎండీ బలరాంలను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. రిటైర్డ్ ఉద్యోగులకు మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలని కోరగా, సానుకూలంగా స్పందించినట్లు రామచందర్‌రావు తెలిపారు.

కొలువులు ఆగమాగం

అన్ని రంగాలకూ ట్రంప్ సుంకాల సెగ • ఆందోళనలో ఉద్యోగుల భవిష్యత్తు

ఇప్పటికే మందగమనంలో దేశ జీడీపీ వృద్ధి • గుబులు పుట్టిస్తున్న కొత్త సవాళ్లు



న్యూఢిల్లీ, మార్చి 7: అమెరికా అధ్యక్షుడి పోకడ.. ఆయా దేశాల్లో పెద్ద ఎత్తునే ఉద్యోగుల ఉసురు తీసేలా ఉన్నది. ఆ జాబితాలో భారత్ కూడా కనిపిస్తుండటం ఆందోళన కలిగిస్తున్న అంశం. అవును.. ఇప్పటికే ద్రవ్యోల్బణం, తయారీసహా కీలక రంగాల్లో నిస్తేజం, జీడీపీ వృద్ధిరేటు మందగమనం, అధిక వడ్డీరేట్ల వంటి సమస్యలతో సతమతమవుతున్న దేశీయ వ్యాపార, పారిశ్రామిక రంగాన్ని ఇప్పుడు అగ్రరాజ్యాధినేత డొనాల్డ్ ట్రంప్ సుంకాల హెచ్చరికలు భయపెడుతున్నాయి. ఏప్రిల్ 2 నుంచి భారత్‌పై సుంకాలుంటాయంటున్న ట్రంప్ ప్రకటనలు నిజమైతే.. ఇండస్ట్రీ కుదేలవడం ఖాయమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతుండటం గమనార్హం. ముఖ్యంగా భారతీయ తయారీ, ఎగుమతుల రంగాలకు గట్టి ఎదురు దెబ్బేనంటున్నారు.

ఇదీ సంగతి..

'ఈ ఇంటికి ఆ ఇల్లు ఎంత దూరమో.. ఆ ఇంటికి ఈ ఇల్లూ అంతే దూరం' అంటున్నారు యూఎస్ బాస్ ట్రంప్. దీంతో ఆయా రంగాల్లో ఇప్పుడు అమెరికా వస్తూత్పత్తులపై భారత్ విధిస్తున్న సుంకాలకు తగ్గట్టుగా భారతీయ వస్తూత్పత్తులపై అమెరికా సుంకాలను వేయనున్నది. భారతీయ రత్నాలు, ఆభరణాల పరిశ్రమ విషయానికే వస్తే.. ట్రంప్ సుంకాల ప్రభావం దీనిపై భారీగానే ఉండే వీలున్నది. ప్రస్తుతం భారతీయ నగలకు అమెరికాలో మంచి డిమాండ్ ఉన్నది. దీంతో అక్కడికి మన ఎగుమతులు భారీగానే జరుగుతున్నాయి. అయితే సుంకాలు పెంచితే వీటి ధరలు అమాంతం పెరిగిపోతాయి. దాంతో వ్యాపారాలకు దెబ్బే. అమెరికా నుంచి భారత్‌కు వస్తున్న జ్యుయెల్లరీపై వాటి విలువలో కేంద్ర ప్రభుత్వం 20 శాతాన్ని సుంకాలుగా వసూలు చేస్తున్నది. కానీ భారత్ నుంచి అమెరికాకు చేరుతున్న నగలపై అక్కడ పడుతున్నది గరిష్ఠంగా 5.5-7 శాతమే. ఇక సానబెట్టిన వజ్రాలపై ఇక్కడ 5 శాతం సుంకం పడితే.. అమెరికాలో ఏమీ లేదు. ఈ లెక్కన ట్రంప్ హెచ్చరించినట్టుగా సుంకాలు పడితే జెమ్స్ అండ్ జ్యుయెల్లరీ ఇండస్ట్రీ కుదేలైనట్టే. దేశంలో 2 లక్షలకుపైగా జనాభా ఈ రంగం ద్వారా ఉపాధి పొందుతున్నది. వీరిలో మహిళలే ఎక్కువ. ఇప్పుడు టారిఫ్‌ల సెగ వీరందరికీ తగులుతున్నట్టే. ఇలాగే అనేక రంగాల పరిస్థితి నెలకొన్నది.

ఐటీ రంగానికీ తిప్పలే

భారతీయ ఐటీ రంగానికున్న ప్రధాన మార్కెట్లలో అమెరికా ఒకటి. అయితే తొలిసారి అగ్రరాజ్య అధ్యక్షుడైనప్పుడే దేశీయ ఐటీ రంగాన్ని ట్రంప్ తీవ్రంగా దెబ్బతీశారు. వీసా నిబంధనలు కఠినతరం, ప్రాజెక్టుల్ని దూరం చేయడం, అమెరికాలో అమెరికన్లతోనే పనిచేయించాలనడం వంటివి ఇండియన్ ఐటీ ఇండస్ట్రీకి ఇబ్బందుల్ని తెచ్చిపెట్టాయి. ఇక్కడి ఐటీ ఉద్యోగ నియామకాలనూ ప్రభావితం చేశాయి. అమెరికాలోనూ భారతీయులకు ఉద్యోగాలు తగ్గిపోయాయి. మళ్లీ ఇప్పుడు ట్రంప్ రావడంతో ఐటీ రంగంలోనూ ప్రకంపనలు మొదలవుతున్నాయి. ఇప్పటికే ఏఐ దెబ్బకు రిక్రూట్‌మెంట్లు మందగించిన విషయం తెలిసిందే. మొత్తానికి ట్రంప్.. ప్రధాని మోదీకి మధ్య సత్సంబంధాలే ఉన్నప్పటికీ.. దేశ ప్రయోజనాలే ముందు అంటున్నారు ట్రంప్. నిజానికి అమెరికా మోటర్‌సైకిళ్లు, విస్కీలపై 20 నుంచి 50 శాతం మేర సుంకాలను కేంద్రం తగ్గించింది. మరికొన్నింటిపైనా సమీక్ష జరుపుతున్నది. మరోవైపు వాణిజ్య మంత్రి గోయల్ అమెరికాలో చర్చల కోసం వెళ్లారు. ఇవన్నీ ఏ మేరకు ఫలిస్తాయో చూడాల్సిందే.

జాబ్ మార్కెట్ మటాష్!

ఇటీవలికాలంలో జాబ్‌మార్కెట్ అల్లకల్లోలంగానే తయారైంది. కృత్రిమ మేధస్సు (ఏఐ) దెబ్బకు ఉద్యోగావకాశాలు భారీగానే కోల్పోవాల్సి వస్తున్నది. దీనికితోడు దేశ, విదేశీ ప్రతికూల పరిస్థితులతో కంపెనీల ఆదాయాలు, లాభాలు తగ్గుముఖం పట్టాయి. ఫలితంగా కొత్త నియామకాలు అంతంతమాత్రంగానే తయారయ్యాయి. ఈ నేపథ్యంలో అమెరికా సుంకాలను పెంచితే.. ఆ ప్రభావం అక్కడి మార్కెట్‌లో మన వస్తువులకున్న డిమాండ్‌ను తప్పక ప్రభావితం చేయగలదు. ఇదే జరిగితే ఇక్కడి నుంచి అక్కడికి ఎగుమతులు పడిపోయి.. ఉత్పత్తి మందగిస్తుంది. దాంతో అంతిమంగా నష్టపోయేది ఉద్యోగులేనన్నది మార్కెట్ నిపుణుల విశ్లేషణ. నిజానికి కరోనా ప్రభావం నుంచి ఇప్పుడిప్పుడే మార్కెట్ కోలుకుంటున్నది. ఈ సమయంలో ట్రంప్ సుంకాల పిడుగు అంగట్లో గట్టిగానే అలజడులను సృష్టిస్తున్నదని చెప్పవచ్చు.

సుంకాలతో ఇబ్బందులు	ప్రభావిత రంగాలు	ఉపశమనం ఎలా?
భారంగా ఎగుమతుల ఖర్చులు	రత్నాలు, ఆభరణాలు	తయారీకి ప్రభుత్వ ప్రోత్సాహకాలు
పడిపోనున్న మార్కెట్ వాటా	ఫార్మా ఇండస్ట్రీ	పరిశ్రమలకు పన్ను మినహాయింపులు
తయారీ రంగం కుదేలు	ఉక్కు, అల్యూమినియం	సులభంగా రుణ లభ్యత
ఉద్యోగుల తొలగింపులు	టెక్స్‌టైల్స్ పరిశ్రమ	విదేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు
ఆర్థిక వ్యవస్థలో మందగమనం	ఎలక్ట్రానిక్స్	వినియోగదారుల కొనుగోలు శక్తి బలోపేతం

- *టారిఫ్‌ల దెబ్బకు వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో అమెరికాకు భారతీయ ఎగుమతులు 2 నుంచి 7 బిలియన్ డాలర్ల మేర పడిపోయే అవకాశం ఉందంటున్న ఇండియా రేటింగ్స్.*
- *ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) ఏప్రిల్-డిసెంబర్‌లో అమెరికాకు భారత ఎగుమతులు గతంతో పోల్చితే 5.57 శాతం పెరిగి 59.93 బిలియన్ డాలర్లుగా నమోదు. అమెరికా నుంచి దిగుమతులు కూడా 1.91 శాతం పెరిగి 33.4 బిలియన్ డాలర్లకు చేరిక.*
- *అమెరికా పెంచే సుంకాలతో భారత జీడీపీ వృద్ధిరేటు 5 నుంచి 10 బేసిస్ పాయింట్లు క్షీణించే వీలుందంటున్న ఇండియా రేటింగ్స్ ప్రధాన ఆర్థికవేత్త దేవేంద్రకుమార్ పంత్.*

SBI

మహిళలకు ఎస్బీఐ చౌక రుణాలు

'నారీ శక్తి' డెబిట్ కార్డు పరిచయం

ముంబై, మార్చి 7: ఔత్సాహిక మహిళా వ్యాపార, పారిశ్రామికవేత్తలకు తక్కువ వడ్డీరేటుకే పూచీకత్తు లేకుండా రుణాలు మంజూరు చేస్తామని శుక్రవారం ఎస్బీఐ ప్రకటించింది. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం కావడంతో 'అస్మిత' పేరిట ఈ ప్రత్యేక లోన్లకు ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం శ్రీకారం చుట్టింది. బ్యాంక్ చైర్మన్ సీఎస్ శెట్టి మాట్లాడుతూ.. మహిళల ఆధ్వర్యంలో నడిచే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలకు వేగంగా, సులభంగా ఈ రుణాలను అందజేస్తామన్నారు. ఇదిలావుంటే 'నారీ శక్తి' ప్లాటినమ్ రూపే డెబిట్ కార్డునూ ఎస్బీఐ ఈ సందర్భంగా తీసుకొచ్చింది.

బీవోబీ నయా అకౌంట్స్

ప్రవాస భారతీయ మహిళల కోసం బ్యాంక్ ఆఫ్ బరోడా శుక్రవారం 'బోవోబీ గ్లోబల్ వుమెన్ ఎన్‌ఆర్‌ఈ, ఎన్‌ఆర్‌వో సేవింగ్స్ అకౌంట్'ను అందుబాటులోకి తెచ్చింది. గృహ, వాహన రుణాలపై చౌక వడ్డీ, తక్కువ ప్రాసెసింగ్ చార్జీలు, లాకర్ అద్దెపై 100 శాతం రాయితీ, ఎయిర్‌పోర్టుల్లో ఉచితంగా దేశీయ, అంతర్జాతీయ లాంజ్ సౌకర్యం పొందేలా కస్టమైజ్డ్ డెబిట్ కార్డు వంటి ప్రయోజనాలు ఈ ఖాతా దారులకుంటాయి.

ఎంఎస్‌ఎంఈలకు ప్రత్యేక క్లస్టర్లు

రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, మార్చి 7 (నమస్తే తెలంగాణ): తెలంగాణ బ్రాండ్‌ను విశ్వవ్యాప్తం చేసేందుకుగాను ఎంఎస్‌ఎంఈలకోసం ప్రత్యేకంగా క్లస్టర్లను ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఎఫ్‌టాప్సీ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో 'ఎంఎస్ఎంఈ స్పార్క్-2.0' పేరిట ఏర్పాటు చేసిన సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎంఎస్‌ఎంఈ నిర్వాహకుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని, వారి ఉత్పత్తులను అంతర్జాతీయంగా మార్కెటింగ్ చేసుకొనేందుకు తగిన ప్రోత్సాహం అందిస్తామని పేర్కొన్నారు.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్

మంచిర్యాల అర్బన్, మార్చి 7 : ఇంటర్ పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఇతర పరీక్షా కేంద్రాలను డీసీపీ సందర్శించారు. ఈ సందర్భంగా బందోబస్తు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఎస్కార్ట్ సిబ్బంది క్వశ్చన్ పేపర్ తీసుకొని వచ్చేటప్పుడు, ఆన్సర్ పేపర్లు తీసుకెళ్లేటప్పుడు అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలన్నారు. ఎగ్జామ్ సెంటర్ చుట్టూ పరిసర ప్రాంతాలను కూడా గమనిస్తూ ఉండాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద 163 బీఎన్‌ఎస్‌ఎస్ సెక్షన్ అమలులో ఉందని తెలిపారు. డీసీపీ వెంట మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాశ్, మంచిర్యాల పట్టణ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్ రావు, సిబ్బంది ఉన్నారు.

పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న మంచిర్యాల డీసీపీ భాస్కర్

బెటాలియన్ కమాండెంట్‌కు ఉద్యోగోన్నతి

హాజీపూర్, మార్చి 7 : గుడిపేటలో గల 13వ ప్రత్యేక తెలంగాణ పోలీస్ బెటాలియన్‌లో ఇన్‌చార్జి కమాండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న పీ వెంకట్రాములుకు కమాండెంట్‌గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా బెటాలియన్‌లోని సిబ్బంది కమాండెంట్‌ను కలిసి సన్మానించారు. పుష్పగుచ్ఛాలు అందించి, శుభాకాంక్షలను తెలిపారు. అనంతరం కమాండెంట్ మాట్లాడుతూ ఉద్యోగోన్నతితో బాధ్యత పెరిగిందని, పోలీస్ శాఖ గౌరవం, ప్రతిష్ట పెరిగేలా వ్యవహరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ కాళిదాసు, యూనిట్ మెడికల్ అధికారి సంతోష్ సింగ్, బెటాలియన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశంసాపత్రాలతో విద్యార్థులు, అధ్యాపకులు

జిజ్ఞాస పోటీలకు ఎంపిక

మంచిర్యాల (ఏసీసీ), మార్చి 7 : రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిగ్రీ కళాశాలకు నిర్వహించిన జిజ్ఞాస పోటీల్లో మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ వీ చక్రపాణి తెలిపారు. డిజిటల్ రంగంలో తెలుగు భాష అభివృద్ధి-అధ్యయనం అనే అంశంపై హర్షవర్ధిని, రాజశేఖర్, సాహితి, శ్రీనాథ్, సంధ్య, కంప్యూటర్ విభాగం అధిపతి ఎండీ గులాం రసూల్, అధ్యాపకురాలు త్రివేణి పర్యవేక్షణలో పరిశోధన చేశారని పేర్కొన్నారు. కంప్యూటర్ ప్రోగ్రామింగ్, యాప్స్‌కు సంబంధించిన కోడింగ్‌ను తెలుగు భాషలో ఎందుకు రాయకూడదు అనే ఉద్దేశంతో ఈ వివరణాత్మక పరిశోధన చేశారని వెల్లడించారు. రాష్ట్రస్థాయిలో ఎంపికైన పరిశోధన అంశాలను 6న పర్యవేక్షకుల సమక్షంలో సమర్పించి, పీపీటీ ప్రదర్శించినట్లు వివరించారు. ఈ సందర్భంగా వీరిని ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ సూది రెడ్డి నరేందర్ రెడ్డి, జిజ్ఞాస కోఆర్డినేటర్ టీ గంగయ్య, తెలుగు విభాగం అధ్యక్షుడు ఎస్ హరీశ్ కుమార్, అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం, తోటి విద్యార్థులు అభినందించారు.

నస్పూర్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌ను సన్మానిస్తున్న పాఠశాల నిర్వాహకులు

చెన్నూర్ : మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న నీటిపారుదల శాఖ సిబ్బంది

ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలు

సీసీసీ నస్పూర్, మార్చి 7 : సీసీసీ నస్పూర్ తాళ్లపల్లి పునరావాసకాలనీలోని మదర్స్ ప్రైడ్ పాఠశాలలో ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఈవో దామోదర్ హాజరై, మాట్లాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళలు పురుషులతో సమానంగా పోటీ పడుతూ అన్ని రంగాల్లో రాణిస్తుండడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ ఆకట్టుకున్నది. అనంతరం వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కరస్పాండెంట్ రేగళ్ల ఉపేందర్, ఇన్‌చార్జి స్వదీప్తి, సీతారాంపల్లి పాఠశాల హెచ్‌ఎం పద్మజ, నస్పూర్, కుందారం పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లు సమత, శ్రావ్య, అభ్యాస పాఠశాల ప్రిన్సిపాల్ సుధాతి, నాగపూర్ ఎమ్మార్సీ సభ్యులు సింధూ, మహేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హాజీపూర్, మార్చి 7 : టీఎన్జీవో సంఘం హైదరాబాద్‌లోని కేంద్ర సంఘంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో జిల్లాకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు. టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఉద్యోగుల సమస్యలను కేంద్ర సంఘం దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపురావు, ఉపాధ్యక్షురాలు కెజియా రాణి, సంయుక్త కార్యదర్శి సునీత, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

కోటపల్లి, మార్చి 7 : మండలంలోని దేవులవాడ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం సయింపు శ్రీనివాస్ రావ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు అర్చన, విక్టోరియా రాణి, సంధ్యారాణి, భాగ్యలక్ష్మి, ఏపీసీ చైర్మన్ సువర్ణ, సభ్యులు కోమలత, హెల్త్ ఆఫీసర్ హిరణ్మయి, ఆశ కార్యకర్త సుమలత, వంట మనుషులు సమ్మక్క, లక్ష్మిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు శ్రీమూర్తి, కొప్పుల తిరుపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెన్నూర్ రూరల్, మార్చి 7 : చెన్నూర్ మండలం ఎల్లక్కపేటలోని చెన్నూర్ నీటిపారుదల శాఖ కార్యాలయంలో మహిళా సిబ్బందిని ఇరిగేషన్ ఈఈ విష్ణుప్రసాద్ ఆధ్వర్యంలో డిప్యూటీ ఈఈ వెంకటస్వామి, ఏఈఈలు, కార్యాలయ సీనియర్, జూనియర్ అసిస్టెంట్ సన్మానించారు.

కాసిపేట, మార్చి 7 : కాసిపేట మోడల్ స్కూల్‌లోని మహిళా సిబ్బందిని ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ ఆధ్వర్యంలో శాలువాలతో సత్కరించారు. ఎంటెక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమంలో భాగంగా ఫ్యాన్సీ డ్రెస్ పోటీ నిర్వహించారు. విద్యార్థులు హర్యానా రాష్ట్ర సంస్కృతిని ప్రతిబింబించేలా నృత్య ప్రదర్శన చేశారు. మహిళా దినోత్సవం సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్, ఉపాధ్యాయులు సుష్మా మాధురి, స్వప్న రాణి, చైతన్య స్రవంతి, అనిత, భాగ్య శ్రీ, సంయుక్త, రేణుక, మహేశ్వరి, పద్మజ, శారద పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ రూరల్, మార్చి 7 : కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా అధ్యాపకులను సన్మానించారు. మహిళలు దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని ప్రిన్సిపాల్ శ్రీదేవి పేర్కొన్నారు.

నేడు సింగరేణి ఆధ్వర్యంలో..

రెబ్బెన, మార్చి 7 : బెల్లంపల్లి ఏరియా గోలేటి సీఈఆర్ క్లబ్‌లో శనివారం సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఏరియా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి తెలిపారు. సాయంత్రం 5గంటల నుంచి ప్రారంభమయ్యే వేడుకలకు ముఖ్యఅతిథిగా చిన్నవిశ్వనాథ్ భూసారధి ఐఎఫ్ఎస్, ఏరియా సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు పద్మ విజయభాస్కర్‌రెడ్డి, జీఎం విజయభాస్కర్‌రెడ్డి, ప్రత్యేక అతిథులుగా ఆర్తీగార్గ్, అమ్రితబొబాడే, ఆసిఫాబాద్ డీఎఫ్‌వో నీరజ్ టిబ్రెవాల్, ఎఫ్‌డీవో శశాంక్ హాజరవుతున్నారని పేర్కొన్నారు. కార్మిక కుటుంబాలు, పుర ప్రజలు, సింగరేణి సేవా సమితి సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రెబ్బెన మండల కేంద్రంలో శనివారం మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ పార్టీ కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి కుందారపు శంకరమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మహిళలను సన్మానిస్తున్నట్లు పేర్కొన్నారు. పెద్ద సంఖ్యలో మహిళలు హాజరై, విజయవంతం చేయాలని కోరారు.

కోటపల్లి : దేవులవాడ ఉన్నత పాఠశాలలో మహిళలను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కాసిపేట : మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలి

బెల్లంపల్లి, మార్చి 7 : పట్టణంలోని బజార్ ఏరియాలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేశ్ కోరారు. ఈ మేరకు ఏసీపీ రవికుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. పాత బస్టాండ్ నుంచి కాంటా చౌరస్తా వరకు ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ పెరిగిపోతున్నదని పేర్కొన్నారు. పుర వీధుల్లో ట్రాఫిక్ ప్రధాన సమస్యగా మారిందని, పార్కింగ్ స్థలం లేక రోడ్లపైనే వాహనాలు నిలుపుతున్నారని తెలిపారు. రాత్రి సమయంలో రావాల్సిన భారీ వాహనాలు ఉదయం రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నాని పేర్కొన్నారు. పట్టణ కార్యదర్శి రమేశ్, మండల కార్యదర్శి ఆరపెల్లి సతీశ్, నాయకులు పోలోజు రామకృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

క్రీడాకారులకు సన్మానం

మంచిర్యాలటౌన్, మార్చి 7 : గోవాలో 16 నుంచి 23వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీకి ఎంపికైన మంచిర్యాల జిల్లా క్రీడాకారులు పళ్లెం రాజులింగు, భోనగిరి హర్షవర్ధన్‌ను స్టార్ మంచిర్యాల జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు గాజుల ముఖేశ్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. జిల్లా కేంద్రంలోని సుచిత్ర హోటల్‌లో శుక్రవారం అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మీటింగ్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వై ఉపేందర్ రావు, అతిథులుగా ఉమ్మడి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ రామచందర్, బాక్సింగ్ కోచ్ రాజేశ్, బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రమోహన్ గౌడ్ హాజరయ్యారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదరిర్శ పుల్లూరు సుధాకర్, ఉపాధ్యక్షుడు భాస్కర్ల వాసు, అసోసియేషన్ సభ్యులు భోనగిరి కృష్ణ, లక్ష్మీనారాయణ, మహేశ్, రవి, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రీడాకారులను సన్మానిస్తున్న బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు

పాఠశాలపై చర్యలు చేపట్టాలి

మందమర్రి రూరల్, మార్చి 7 : పట్టణంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించకుండా ధనార్జనే ధ్యేయంగా నడుపుతున్న శ్రీ చైతన్య పాఠశాలపై సమగ్ర విచారణ జరిపించి, కఠిన చర్యలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల విద్యావనరుల కేంద్రంలోని సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షుడు బచ్చలి ప్రవీణ్ కుమార్, తెలంగాణ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు రేగుంట క్రాంతి కుమార్ మాట్లాడారు. పాఠశాలలో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస విద్యార్హతలేని ఉపాధ్యాయులతో బోధన కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. అధికారులు చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

సైబర్ నేరాలపై అవగాహన

రామకృష్ణాపూర్, మార్చి 7 : రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులకు శుక్రవారం పట్టణ ఎస్ఐ రాజశేఖర్ సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రెండో ఎస్ఐ లలిత, ఏఎస్ఐ వెంకన్న, కానిస్టేబుల్ బాలకృష్ణ, పాఠశాల ప్రిన్సిపాల్ ప్రేమరాణి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న పట్టణ పోలీసులు